

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 30-08-2026 | సంపుటి - 31 | సంచిక - 97 | రూ : 4 | పేజీలు : 8




## టిబెట్‌లోనూ జలవిలయం
# నిజాలు దాస్తున్న డ్రాగన్

- టిబెట్-నేపాల్ సరిహద్దుల్లో భారీ వరదలతో తీవ్ర నష్టం
- విలయానికి సంబంధించిన వీడియోలు చైనాలో తొలగింపు
- అంతర్జాతీయంగా వైరల్ అవుతున్న భయానక దృశ్యాలు
- వరద నష్టం కాకుండా సహాయక చర్యలకే చైనా మీడియా ప్రాధాన్యం
- వందలాది మంది గల్లంతైనా వివరాలు వెల్లడించని అధికారులు

2లో

## దేశవ్యాప్తంగా రేపు నీట్ పీజీ2026 పరీక్ష..
# పకడ్బందీ ఏర్పాట్లు చేసిన కేంద్రం



- 2.73 లక్షల మందికి పైగా హాజరుకానున్న వైద్య గ్రాడ్యుయేట్లు
- పటిష్ఠ భద్రత, పారదర్శకతకు పెద్దపీట వేసిన కేంద్ర ప్రభుత్వం
- ప్రశ్నపత్రం లీక్ వదంతులు పూర్తిగా అవాస్తవమన్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా
- ఈ ఏడాది పలు విద్యార్థి-స్నేహపూర్వక సంస్కరణల అమలు

2లో



2లో

ఓటర్లు అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించేందుకు..
## సర్ గడువును 4 వారాలు పొడిగించండి

- రాష్ట్రంలో ఇప్పట్లో ఎన్నికలు లేవు.. విచారణకు తగిన సమయం అవసరం
- మండల స్థాయి అధికారులు ఇచ్చే పత్రాలను గుర్తింపు కోసం అంగీకరించాలి



## భారత్‌తో ఘర్షణల నాటి జనరల్‌ను పదవుల నుంచి తొలగించిన చైనా

- గల్వాన్, దోక్లాం ఘర్షణల నాటి జనరల్‌పై చైనా వేటు
- పీఎల్ఏ మాజీ జనరల్ జావో జోంగ్కీని కీలక పదవుల నుంచి తొలగింపు
- ఎలాంటి అధికారిక కారణం వెల్లడించని బీజింగ్ ప్రభుత్వం
- సైన్యంపై పట్టు బిగించేందుకు జిన్‌పింగ్ చేపట్టిన ప్రక్షాళనలో భాగంగానే ఈ చర్యలు

2లో

## ఉద్యోగం కోల్పోతే వెంటనే వెనక్కి..




- హెచ్-1బీ కొత్త నిబంధనపై వైట్‌హౌస్ సమీక్ష పూర్తి.. భారతీయ టెక్కీల్లో ఆందోళన!

2లో

## హర్మూజ్ సంక్షోభం
### గల్ఫ్‌లో చిక్కుకున్న 400 నౌకలు, 6000 మంది సిబ్బంది



- ఆరు నెలలుగా కొనసాగుతున్న మధ్యప్రాచ్య సంక్షోభం
- అంతర్జాతీయ షిప్పింగ్‌పై 70 దాడులు, 19 మంది నావికుల మృతి
- ఇంధనం, ఎరువుల సరఫరా గొలుసులపై తీవ్ర ప్రభావం
- పరిష్కారానికి కృషి చేయాలని సభ్య దేశాలకు ఐఎంఓ పిలుపు

మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో తీవ్ర అనిశ్చితి కొనసాగుతోంది. హర్మూజ్ జలసంధిలో ఏర్పడిన సంక్షోభం కారణంగా గత ఆరు నెలలుగా సుమారు 400 నౌకలు, వాటిలోని దాదాపు 6,000 మంది సిబ్బంది చిక్కుకుపోయారని అంతర్జాతీయ సముద్రయాన సంస్థ (ఐఎంఓ) శుక్రవారం వెల్లడించింది. ఈ సంక్షోభం ఇంకా సమసిపోలేదని ఐఎంఓ సెక్రటరీ జనరల్ ఆర్సెనియో డొమింగ్యూజ్ తెలిపారు. కొన్ని నౌకలు, సిబ్బంది ఆ ప్రాంతం నుంచి బయటపడగలిగి తరువాయి 2లో



## వ్యాయామ విద్యకు మహర్దశ!

- రాష్ట్రంలోని ఏకైక కళాశాల పునరుద్ధరణకు సీఎస్ఆర్ నిధులు
- ముందుకొచ్చిన రెడ్డీస్ ల్యాబ్, గ్రీన్ పార్క్

హైదరాబాద్: అది రాష్ట్రంలోని ఏకైక ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల. విద్యార్థుల్లో దేహదారుఢ్యాన్ని పెంపొందించి... భవిష్యత్ వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చే సంస్థ. హైదరాబాద్ దోమలగూడలో 1958 సంవత్సరంలో ప్రారంభమైన కళాశాలలోని అధిక భవనాలు నిజాం కాలం నాటివి కావడంతో శిథిలావస్థకు చేరాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద కొత్త భవనాలు నిర్మించడంతోపాటు ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు రెండు కంపెనీలు ముందుకు రావడంతో మరో ఏడాదిన్నకాలంలో కళాశాలకు మహర్దశ పట్టనుంది.

తరువాయి 2లో

# ఉద్యమకారుల రుణం తీర్చుకుంటాం

### వారి సేవలకు తగిన గౌరవం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత

- గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయాలి
- కమిటీతో భేటీలో సీఎం
- 250 గజాల నివాస స్థలం, ఇతర డిమాండ్లపై సానుకూలత



హైదరాబాద్: తెలంగాణ ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం ప్రభుత్వ బాధ్యతని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వారి గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఉద్యమకారుల ప్రధాన డిమాండ్లయిన 250 గజాల నివాస స్థలం, చేయూత పింఛను, ఆరోగ్య కార్డులు, ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యం, ఉద్యమంలో పాలుపంచుకున్న ఉద్యోగులకు గౌరవ గుర్తింపు తదితర అంశాలపై సీఎం సానుకూలత వ్యక్తంచేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఛైర్మన్ కేశవరావు, సభ్యులు రాములునాయక్, శోభన్‌రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాంలు శనివారం సీఎంతో భేటీ అయ్యారు. సమావేశంలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని అమరవీరుల స్మారక చిహ్నం వేదికగా 13 వేల మందికిపైగా తెలంగాణ ఉద్యమకారులతోపాటు వివిధ జేఏసీలు, ప్రజాసంఘాలు, కవులు, కళాకారులు, మహిళా ఉద్యమకారుల నుంచి సేకరించిన అభిప్రాయాలను క్రోడీకరించి... ఉద్యమకారుల వర్గీకరణకు సంబంధించిన ముసాయిదా నివేదికను కమిటీ సీఎంకు సమర్పించింది. ఉద్యమకారుల డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్లింది. త్వరితగతిన కసరత్తు: ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ఉద్యమకారుల త్యాగాలను గుర్తిస్తూ వారి సేవలకు తగిన గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ కోసం అధికారిక వెబ్‌సైట్/పోర్టల్ ఏర్పాటు, డిజిటల్ దరఖాస్తుల స్వీకరణ, జిల్లాల వారీగా సమన్వయం, అవసరమైన పరిపాలన వనరుల కల్పన వంటి అంశాలలో కమిటీకి సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశం అనంతరం కమిటీ ఛైర్మన్, సభ్యులు మాట్లాడుతూ, ''కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు జీవో నెం.679 ద్వారా తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు, ఉద్యమకారుల సంక్షేమానికి సంబంధించిన డిమాండ్లపై సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# టిబెట్‌లోనూ జలవిలయం.. నిజాలు దాస్తున్న డ్రాగన్

టిబెట్ నేపాల్ సరిహద్దులోని గైరాంగ్ పోర్టు ప్రాంతంలో సంభవించిన జల ప్రళయానికి సంబంధించిన భయానక దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా వైరల్ అవుతుండగా, చైనా ప్రభుత్వం మాత్రం వాటిని తన దేశంలో మీడియాలో కనపడకుండా కఠిన చర్యలు చేపట్టింది. వరద విలయం తీవ్రతను, వాస్తవ నష్టాన్ని కప్పిపుచ్చుతూ సమాచారంపై ఉక్కుపాదం మోపుతోంది. ఆగస్టు 26న సంభవించిన ఈ ప్రకృతి విపత్తులో, గైరాంగ్ సరిహద్దు క్రాసింగ్ వద్ద వరద నీరు ఉధ్ధృతంగా ప్రవహిస్తూ వాహనాలను, ఇతర వస్తువులను కొట్టుకుపోతున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ప్రాణభయంతో జనం పరుగులు తీస్తున్న ఈ వీడియోలు అంతర్జాతీయ సోషల్ మీడియా వేదికలపై వేగంగా వ్యాపించాయి. అయితే, చైనాలోని సామాజిక మాధ్యమ ప్లాట్‌ఫామ్‌ల నుంచి ఇలాంటి వీడియోలను అధికారులు తక్షణమే తొలగించారు. అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఆదేశించిన సహాయక చర్యలకు మాత్రమే ప్రభుత్వ మీడియా ప్రాధాన్యతనిస్తోంది తప్ప, ప్రాణ, ఆస్తి నష్టం వివరాలను కానీ, బాధితుల వెతలను కానీ బయటి ప్రపంచానికి తెలియనివ్వడం లేదు. టిబెట్‌లోని గైరాంగ్ కౌంటీలో కొద్దిమంది మరణించారని, విదేశీయులతో సహా వందలాది మంది గల్లంతయ్యారని చైనా అధికారులు ప్రకటించారు. అయితే, ప్రభావితమైన గ్రామాల వివరాలపై కానీ, నష్టం పూర్తి స్థాయిపై కానీ ఇప్పటికీ స్పష్టత ఇవ్వడం లేదు. మరోవైపు, నేపాల్ సరిహద్దు వైపు నుంచి వరద నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు, చిత్రాలు వెలువడుతుండగా, టిబెట్ వైపు మాత్రం సమాచారాన్ని పూర్తిగా నియంత్రించడంపై మానవ హక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. హిమానీనదం (గ్లేసియర్) విచ్ఛిన్నం వల్లే ఈ ఆకస్మిక వరదలు సంభవించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సరిహద్దుకు ఇరువైపులా గాలింపు, సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

## ఓటర్లు అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించేందుకు.. సర్ గడువును 4 వారాలు పొడిగించండి

హైదరాబాద్: సర్‌లో భాగంగా ఓటర్లు అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించడానికి గడువును పొడిగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. ఇప్పట్లో తెలంగాణలో ఎలాంటి ఎన్నికలు లేవని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించేందుకు తగిన సమయం ఇవ్వాలని సూచించారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు శనివారం ముఖ్యమంత్రి ఈ మేరకు లేఖ రాశారు. ''అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించేందుకు ప్రస్తుతం సెప్టెంబరు 16 వరకు ఉన్న గడువును మరో నాలుగు వారాలు పొడిగించాలి. తుది జాబితా ఓటర్ల ప్రచురణ తేదీ ప్రస్తుతం అక్టోబరు 19గా ఉండగా దానినీ మార్చాలి. సర్‌కు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోంది. రాష్ట్రంలో అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు తొలగిపోకూడదు. అలాగే అనర్హులైన వారు ఒక్కరూ జాబితాలో ఉండకూడదు. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. ఇందులో భాగంగా అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించడానికి ఓటర్లకు తగిన సమయం ఉండాలి. ఇందుకోసం విధానపరమైన చర్యలు తీసుకోవాలి. 2026 జూన్ 10 నాటికి రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 73.39 లక్షల మంది(21.7%)ని ఏఎస్‌డీడీ(గైర్హాజరు, నివాసం మారిన, మృతి చెందిన, డూప్లికేట్) ఓటర్లుగా గుర్తించారు. ఈ జాబితాలో 45.19 లక్షల మంది(సుమారు 62%)ని శాశ్వతంగా నివాసం మారిన వారిగా గుర్తించడం ఆందోళనకరం. మరోవైపు డిజిటలైజ్ చేసిన 2.65 కోట్ల ఎన్యూమరేషన్ పత్రాల్లోని 60.50 లక్షల్లో అనామలీస్(లోపాలు) ఉన్నాయి. 32.36 లక్షల ఫారాలను గత సర్ ఓటర్ల జాబితాతో అనుసంధానం చేయలేదు. దాంతో సుమారు 92.86 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది రాష్ట్రంలో దాదాపు మూడో వంతు ఓటర్లను ప్రభావితం చేసే అంశం'' అని గణాంకాలతో సహా సీఈసీకి సీఎం లేఖ రాశారు.

**కీలక లోపాలు ఉన్నాయ్...**

''ప్రస్తుతం చేపట్టిన సర్‌లో కొన్ని కీలక లోపాలు ఉన్నాయి. సర్వే సమయంలో తాత్కాలికంగా ఇళ్లలో లేని వారిని, శాశ్వతంగా నివాసం మారిన వారిని సిబ్బంది ఒకే గాటనకట్టారు. నిజంగా నివాసం మారిన వారికి కొత్త ప్రాంతంలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలి. ఎలాంటి సమాచారం అందించకుండానే పాత నివాసంలో ఉన్న ఓటును తొలగిస్తున్నారు. అంతేకాకుండా నివాసం మారిన ఓటర్ల పేర్లను తొలగించే ముందు అధికారిక నోటీసు ప్రక్రియను పాటించడం లేదు. దానివల్ల పోలింగ్ రోజున కేంద్రానికి వెళ్లే వరకు ఓటు పోయిన విషయాన్ని ఓటరు తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం'' అని సీఎం రేవంత్‌రెడ్డి లేఖలో వివరించారు.

**మూడు జిల్లాల్లోనే ఎక్కువ...**

''రాష్ట్రంలోని మొత్తం ఏఎస్‌డీడీ జాబితాలో ఉన్న ఓటర్లలో హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే 58.6% మంది ఉన్నారు. అలాగే నోటీసులు అందుకునే వారిలో 41.9% మంది ఉన్నారు. ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో అనేక మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నందున సర్ ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన అవసరముంది. గ్రామాలు, పురపాలిక వార్డుల్లో ముందుగానే విస్తృత ప్రచారం నిర్వహించాలి. కనీసం రెండుసార్లు గ్రామ/వార్డు సమావేశాలు ఏర్పాటు చేసి ముసాయిదా జాబితాను చదివి వినిపించాలి. నోటీసులు అందుకున్న రోజువారీ కూలీలు, వలస కార్మికులు, వృద్ధులు తమ పత్రాలను సమర్పించేందుకు వారం రోజుల సమయం సరిపోదు. కనీసం మూడు నుంచి నాలుగు వారాల సమయం ఇవ్వాలి. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల స్థాయిలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఓటర్లకు అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించాలి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో సగటున 78 వేలకు పైగా నోటీసులు అందుకునే కేసులు ఉన్నందున విచారణకు ప్రస్తుతం ఉన్న అధికారులు సరిపోరు. అదనంగా ఏఈఆర్వోలను నియమించాలి. ఓటర్లకు నోటీసులు అందించే పత్రాల్లో సంబంధిత తేదీలు, సమయాలను చేర్చాలి'' అని సీఎం రేవంత్.. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సూచించారు.

## భారత్‌తో ఘర్షణల నాటి జనరల్‌ను పదవుల నుంచి తొలగించిన చైనా

భారత్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) మాజీ జనరల్ జావో జోంగ్కీపై చైనా ప్రభుత్వం వేటు వేసింది. దేశంలోని అత్యున్నత రాజకీయ సలహా మండలి సభ్యత్వంతో పాటు ఆయన నిర్వహిస్తున్న ఇతర కీలక రాజకీయ పదవుల నుంచి జీవోను తొలగించింది. 2017లో జరిగిన డోక్లాం ప్రతిష్టంభన, 2020 నాటి గల్వాన్ లోయ ఘర్షణల సమయంలో జావో జోంగ్కీ పీఎల్ఏ వెస్ట్రన్ థియేటర్ కమాండ్‌కు అధిపతిగా వ్యవహరించారు. చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ (CPPCC) స్టాండింగ్ కమిటీ ఆగస్టు 26న సమావేశమై జావోను పదవుల నుంచి తొలగించాలని ఓటింగ్ ద్వారా నిర్ణయించింది. జాతీయ కమిటీ సభ్యత్వంతో పాటు, జాతి, మతపరమైన వ్యవహారాల కమిటీ డిప్యూటీ డైరెక్టర్ పదవి నుంచి కూడా ఆయన్ను తప్పించారు. అయితే, ఈ నిర్ణయానికి గల కారణాలను చైనా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించలేదు. ఆయనపై ఎటువంటి విచారణకు ఆదేశించినట్లు కూడా ఇప్పటివరకు ప్రకటించకపోవడం గమనార్హం. భారత్‌తో సరిహద్దు వ్యవహారాలను పర్యవేక్షించే వెస్ట్రన్ థియేటర్ కమాండ్‌కు 2016లో తొలి కమాండర్‌గా జావో నియమితులయ్యారు. ఆయన పదవీకాలంలోనే 2017లో 73 రోజుల పాటు డోక్లాం ప్రతిష్టంభన కొనసాగింది. అలాగే 2020లో 20 మంది భారత సైనికులు వీరమరణం పొందిన గల్వాన్ ఘర్షణలు కూడా ఆయన పర్యవేక్షణలోనే జరిగాయి. అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సైన్యంలో చేపట్టిన భారీ ప్రక్షాళనలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవలే తీవ్రమైన క్రమశిక్షణా ఉల్లంఘనల ఆరోపణల నేపథ్యంలో జనరల్ జాంగ్ యోక్సియా, లియు జెన్లీలను కూడా సెంట్రల్ మిలిటరీ కమిషన్ నుంచి తొలగించారు. సైన్యంపై తన పట్టును మరింత బిగించుకునే క్రమంలోనే జిన్‌పింగ్ వరుసగా ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

## ఉద్యోగం కోల్పోతే వెంటనే వెనక్కి

అమెరికాలో హెచ్ 1బీ వీసాపై పనిచేస్తున్న వేలాది మంది భారతీయ నిపుణులకు ఆందోళన కలిగించే పరిణామం చోటుచేసుకుంది. ఉద్యోగం కోల్పోయిన తర్వాత కొత్త ఉపాధి వెతుక్కోవడానికి లేదా దేశం విడిచి వెళ్లేందుకు వీలు కల్పించే 60 రోజుల గ్రేస్ పీరియడ్‌ను రద్దు చేసే ప్రతిపాదనపై ట్రంప్ యంత్రాంగం తన సమీక్షను పూర్తి చేసింది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే, ముఖ్యంగా భారతీయ టెక్కీలు, వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడనుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) "60 రోజుల విచక్షణాధికార గ్రేస్ పీరియడ్ తొలగింపు" అనే పేరుతో ఈ ప్రతిపాదనను ఆగస్టు 6న వైట్‌హౌస్‌కు పంపింది. ఆగస్టు 27న దీనిపై సమీక్ష ముగిసింది. కొన్ని మార్పులతో ఈ ప్రతిపాదన వైట్‌హౌస్ ఆమోదం పొందినట్లు అధికారిక రికార్డులు సూచిస్తున్నాయి. అయితే, ఈ ప్రతిపాదన పూర్తి వివరాలు ఇంకా బహిర్గతం కాలేదు. అందువల్ల, ప్రస్తుతం ఉన్న 60 రోజుల గ్రేస్ పీరియడ్ నిబంధన యథావిధిగా అమల్లో ఉంది. తదుపరి దశలో ఈ ప్రతిపాదిత నియమాన్ని ఫెడరల్ రిజిస్టర్‌లో ప్రచురించి, ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరిస్తారు. ఆ తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటారు. ప్రస్తుత నిబంధన ప్రకారం.. హెచ్ 1బీ, ఎల్ 1, ఓ 1 వంటి తాత్కాలిక ఉపాధి వీసాలపై ఉన్నవారు ఉద్యోగం కోల్పోతే 60 రోజుల వరకు అమెరికాలో ఉండవచ్చు. ఈ సమయంలో వారు కొత్త స్పాన్సర్‌ను వెతుక్కోవడం, ఇమ్మిగ్రేషన్ స్టేటస్ మార్చుకోవడం లేదా దేశం విడిచి వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకోవచ్చు. ఈ ప్రతిపాదనపై ప్రెసిడెంట్స్ అడ్వైజరీ కమిషన్ ఆన్ ఏషియన్ అమెరికన్స్ మాజీ సభ్యుడు అజయ్ జైన్ భుటోరియా తీవ్రంగా స్పందించారు. ఇది అమానవీయమైన, ఆచరణకు సాధ్యం కాని నిర్ణయమని ఆయన విమర్శించారు. "ఉద్యోగం కోల్పోయిన నిపుణులకు 60 రోజుల సమయమే చాలా తక్కువ. అలాంటిది దాన్ని పూర్తిగా తొలగిస్తే, ఆ కుటుంబాలు తమ ఇళ్లు సర్దుకోవడానికి, పిల్లల చదువుల విషయంలో నిర్ణయం తీసుకోవడానికి కూడా సమయం ఉండదు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేస్ పీరియడ్‌ను 60 రోజుల నుంచి 180 రోజులకు పెంచాలని తాను 2023లోనే వైట్‌హౌస్ కమిషన్‌కు సిఫార్సు చేశానని, దానికి ఏకగ్రీవ ఆమోదం కూడా లభించిందని భుటోరియా గుర్తుచేశారు. టెక్నాలజీ, హెల్త్‌కేర్ వంటి రంగాల్లో నియామకాల ప్రక్రియ చాలా నెమ్మదిగా సాగుతుందని, ఇంటర్వ్యూలు, వీసా బదిలీ పత్రాలకు నెలల సమయం పడుతుందని ఆయన వివరించారు. ఈ ప్రతిపాదనపై పబ్లిక్ కామెంట్లు సమర్పించి, వ్యతిరేకత తెలియజేయాలని ఆయన అమెరికాలోని కమ్యూనిటీ సంస్థలకు, వ్యాపార నాయకులకు పిలుపునిచ్చారు. హెచ్ 1బీ వీసాల లబ్ధిదారుల్లో అత్యధికులు భారతీయులే కావడంతో ఈ ప్రతిపాదన వారిలో తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది.

## హర్మూజ్ సంక్షోభం.. గల్ఫ్‌లో చిక్కుకున్న 400 నౌకలు, 6000 మంది సిబ్బంది

(మొదటిపేజీ తరువాయి)


నప్పటికీ, వేలాది మంది నావికులు ఇప్పటికీ తీవ్ర ముప్పును, అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. ఈ అంతరాయం కారణంగా ఇంధనం, ఎరువులు వంటి నిత్యావసర వస్తువుల ప్రపంచ సరఫరా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 28న ఈ వివాదం ప్రారంభమైనప్పటి నుంచి అంతర్జాతీయ నౌకాయానంపై కనీసం 70 దాడులు జరిగినట్లు ఐఎంఓ ధృవీకరించింది. ఈ దాడుల్లో 19 మంది నావికులు ప్రాణాలు కోల్పోయారు. అంతర్జాతీయ జలసంధుల గుండా రవాణాకు ఎలాంటి ఆటంకాలు కలిగించరాదని జూలైలో ఐఎంఓ కౌన్సిల్ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ జలమార్గంలో నౌకాయానాన్ని పునరుద్ధరించడానికి సభ్య దేశాలన్నీ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చింది. ఈ సమస్యకు ఆచరణాత్మక పరిష్కారాలు కనుగొనేందుకు సభ్య దేశాలు, షిప్పింగ్ పరిశ్రమ కలిసి పనిచేయాలని డొమింగ్యూజ్ కోరారు. మరోవైపు, నల్ల సముద్రం, ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ వంటి ప్రాంతాల్లో కూడా సముద్ర భద్రత క్షీణిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌పై దాడులతో మొదలైన ఈ వివాదంలో పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ, నౌకాయానం, ఇరాన్ అణు కార్యక్రమం, అంతర్జాతీయ ఆంక్షల వంటి అంశాలపై ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది.

## వ్యాయామ విద్యకు మహర్దశ!

హైదరాబాద్: అది రాష్ట్రంలోని ఏకైక ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల. విద్యార్థుల్లో దేహదారుఢ్యాన్ని పెంపొందించి... భవిష్యత్ వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చే సంస్థ. హైదరాబాద్ దోమలగూడలో 1958 సంవత్సరంలో ప్రారంభమైన కళాశాలలోని అధిక భవనాలు నిజాం కాలం నాటివి కావడంతో శిథిలావస్థకు చేరాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద కొత్త భవనాలు నిర్మించడంతోపాటు ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు రెండు కంపెనీలు ముందుకు రావడంతో మరో ఏడాదిన్న కాలంలో కళాశాలకు మహర్దశ పట్టనుంది.

**అధ్యాపక పోస్టులన్నీ ఖాళీ**

మొత్తం 11 ఎకరాల విస్తీర్ణంలోని ఈ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఎడ్), డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్(డీపీఎడ్), మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(ఎంపీఎడ్) కోర్సులు నడిచేవి. భవనాలు శిథిలావస్థకు చేరి కనీస వసతులు లేకపోవడం, శాశ్వత అధ్యాపకుల కొరత కారణంగా 2011 నుంచి పీజీ కోర్సును రద్దు చేశారు. ప్రస్తుతం ఏటా డీపీఎడ్‌లో 200, బీపీఎడ్‌లో 60 మంది ప్రవేశాలు పొందుతున్నారు. అయినా... కనీస వసతులు లేక హాస్టల్ సౌకర్యాన్ని తొలగించారు. ప్రస్తుతం పరిపాలనా భవనం రేకుల షెడ్‌లో కొనసాగుతోంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో 2023 సెప్టెంబరులో అప్పటి ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించి కొత్త భవనాలకు శంకుస్థాపన చేసింది. నిధులు మంజూరు చేయకపోవడంతో దుస్థితి కొనసాగుతోంది. కళాశాలకు 20 మందికిపైగా అధ్యాపకులు అవసరం. పదవీ విరమణ పొందుతున్న అధ్యాపకుల స్థానంలో



కొత్త వారిని నియమించకపోవడంతో ప్రస్తుతం రెగ్యులర్ అధ్యాపకులే లేరు. రెగ్యులర్ ఉద్యోగిగా ఉన్న ప్రిన్సిపల్ సైతం ఏడాది క్రితం పదవీ విరమణ పొందడంతో... పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్‌ను ఇన్‌ఛార్జిగా నియమించారు.

*** ఆధునిక ప్రాంగణానికి రెండు సంస్థలు సిద్ధం...**

జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి(ఎన్‌సీటీఈ) నిబంధనల మేరకు కొత్తగా పరిపాలనా భవనం, తరగతి గదులు, హాస్టళ్లు, సింథటిక్ ట్రాక్, జిమ్, యోగా సెంటర్ నిర్మించాలి. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో... హాస్టల్ భవనాల నిర్మాణానికి గ్రీన్ పార్క్ హోటల్, మిగిలిన భవనాల నిర్మాణం, ఇతర వసతుల కల్పనకు రెడ్డీస్ ల్యాబ్ సూత్రప్రాయంగా అంగీకరించాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. ''శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చినప్పుడు.. తరగతుల నిర్వహణకు ఇబ్బంది లేకుండా తాత్కాలిక షెడ్లు నిర్మిస్తున్నాం. తగిన విద్యార్హతలు ఉన్న ప్రభుత్వ టీచర్లకు పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి త్వరలో 22 మందిని అధ్యాపకులుగా నియమిస్తాం. కొత్త ప్రాంగణం నిర్మాణానికి దాదాపు రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు అవసరమవుతాయి. ప్రస్తుతం అంచనాలు రూపొందిస్తున్నాం'' అని ఆయన వివరించారు.

## దేశవ్యాప్తంగా రేపు నీట్ పీజీ-2026 పరీక్ష

దేశవ్యాప్తంగా వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) సీట్ల భర్తీకి నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్‌పీజీ 2026)కు సర్వం సిద్ధమైంది. ఆదివారం (ఆగస్టు 30) దేశంలోని 340 నగరాల్లో 1,300 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించనున్నారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 2.73 లక్షల మందికి పైగా వైద్య గ్రాడ్యుయేట్లు ఈ పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్ష నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ పరీక్ష ద్వారానే దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఎండీ (డాక్టర్ ఆఫ్ మెడిసిన్), ఎంఎస్ (మాస్టర్ ఆఫ్ సర్జరీ) వంటి ఉన్నత వైద్య కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తారు. గతేడాదితో పోలిస్తే ఈసారి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సంఖ్య 12.5 శాతం పెరిగినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (NBEMS) ఆగస్టు 26న అడ్మిట్ కార్డులను విడుదల చేసింది. పరీక్ష మొత్తం ఒకే షిఫ్టులో జరగనుంది.

**అక్రమాలకు తావివ్వం: మంత్రి జేపీ నడ్డా**

పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పష్టం చేశారు. ఎన్‌బీఈఎంఎస్, టెక్నాలజీ భాగస్వాములు, ఇతర ఏజెన్సీల సంసిద్ధతను ఆయన సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా, అత్యంత పకడ్బందీగా పరీక్షను నిర్వహించాలని




అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రశ్నపత్రం లీక్ అయిందంటూ సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను, మోసపూరిత ప్రచారాలను అభ్యర్థులు నమ్మవద్దని నడ్డా విజ్ఞప్తి చేశారు. "పరీక్ష ప్రారంభానికి కొద్ది సమయం ముందు మాత్రమే అత్యంత సురక్షితమైన, ఎన్‌క్రిప్టెడ్ విధానంలో తుది ప్రశ్నపత్రాన్ని ఎంపిక చేస్తారు. దీనికి బహుళ అంచెల సాంకేతిక, కార్యాచరణ భద్రతా ఏర్పాట్లు ఉంటాయి. కాబట్టి, ఎవరైనా ప్రశ్నపత్రం ముందుగానే తమకు లభించిందని చెబితే అది పూర్తిగా అవాస్తవం, అభ్యర్థులను తప్పుదోవ పట్టించే ప్రయత్నమే" అని ఆయన తేల్చి చెప్పారు. అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, కేవలం ఎన్‌బీఈఎంఎస్, ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని సూచించారు.

**భారీ భద్రత, కొత్త సంస్కరణలు**

పరీక్షల సమగ్రతను కాపాడేందుకు ఈసారి పటిష్ఠమైన భద్రతా ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా సీసీటీవీ నిఘా, బయోమెట్రిక్ వెరిఫికేషన్, సిగ్నల్ జ్యామర్లు, డైనమిక్ కంప్యూటర్ కేటాయింపు వంటి చర్యలు చేపట్టారు. పరీక్షల పర్యవేక్షణకు సెంట్రల్, రీజనల్ కమాండ్ సెంటర్ల ద్వారా లైవ్ మానిటరింగ్ చేయనున్నారు. ఇందుకోసం 60,000 మందికి పైగా సిబ్బందిని నియమించారు. ఈ ఏడాది విద్యార్థుల సౌలభ్యం కోసం పలు సంస్కరణలు ప్రవేశపెట్టారు. అభ్యర్థులు తమ సొంత రాష్ట్రంతో పాటు మరో రెండు రాష్ట్రాలను పరీక్షా కేంద్రాల కోసం ఎంచుకునే వెసులుబాటు కల్పించారు. పరీక్ష జరిగే నగరం సమాచారాన్ని మూడు వారాల ముందే తెలియజేయడంతో, ప్రయాణ ఏర్పాట్లకు విద్యార్థులకు తగినంత సమయం లభించింది. పరీక్షా విధానంలో కూడా మార్పులు చేశారు. 210 నిమిషాల్లో 180 ప్రశ్నలకు సమాధానమిచ్చేలా సమయాన్ని పెంచారు. రిజిస్ట్రేషన్, పరీక్ష సమయంలో ఆధార్ ఆధారిత గుర్తింపును తప్పనిసరి చేశారు. వేలిముద్రలు సరిపోలని సందర్భాల్లో ఐరిస్ ఆధారిత బయోమెట్రిక్ వెరిఫికేషన్‌ను ప్రత్యామ్నాయంగా వినియోగించనున్నారు.

## కాప్రా డివిజన్ కన్వీనర్‌గా రాజు వంశరాజ్ నియామకం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ నియోజకవర్గం కాప్రా డివిజన్ కన్వీనర్‌గా రాజు వంశరాజ్‌ను నియమించారు. తనను కాప్రా డివిజన్ కన్వీనర్‌గా నియమించినందుకు ఉప్పల్ నియోజకవర్గం కన్వీనర్ ఏనుగు రాజిరెడ్డికి, ఉత్సవ సమితి సభ్యులకు రాజు వంశరాజ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరి సహకారంతో కృషి చేస్తానని రాజు వంశరాజ్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఉత్సవ సమితి సభ్యులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

## నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి

**ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు**




ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : కొత్తగూడెం పట్టణంలో గల సిపిఐ పార్టీ జిల్లా కార్యాలయం లో శనివారం శేషగిరి భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అనుముల సాయి, ఎస్.కె ఫహీమ్ దాదా మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో వేలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఖాళీగా ఉండటంతో ప్రజాసేవలు ముందుకు సాగడం లేదని ప్రభుత్వం వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, జాబ్ క్యాలెండర్ ను ప్రకటించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సాధనపల్లి సతీష్ ఎన్ కె ఖయ్యూమ్ , భూపేష్, ఎండి నాదీమ్ , రవికిరణ్ ,కొచ్చర్ల రాకేష్ , నలిగంటి నవీన్, అజయ్ , రసూల్, అమీర్, మాణిక్యాల వినయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## డిపో అభివృద్ధికి ఉద్యోగులు



## సమన్వయంతో పనిచేయాలి

* **బెస్ట్ ఇ.పీ.కే తెచ్చిన కండక్టర్ ను సన్మానించిన డిపో మేనేజర్ ఎన్. వెంకన్న**

హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి: హుస్నాబాద్ ఆర్టీసీ డిపో ఉద్యోగులందరూ సమన్వయంతో పని చేసినప్పుడే లాభాల బాట పడుతుందని అందుకు అందరూ ఉద్యోగులు కృషి చేయాలని హుస్నాబాద్ డిపో మేనేజర్ ఎన్. వెంకన్న అన్నారు.రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకొని ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపి ప్రయాణికులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా గమ్యస్థానాలకు చేర్చేందుకు కృషిచేసిన హుస్నాబాద్ ఆర్టీసీ డిపో కండక్టర్ డ్రైవర్లకు అభినందనలు తెలిపారు. అందులో భాగంగా రాఖీ పౌర్ణమి రోజు బెస్ట్ ఇపీకే తెచ్చిన కండక్టర్ జి. జ్యోతిని డిపో మేనేజర్ శాలువాతో సత్కరించి అభినందించారు.ఇలాగే అందరూ ఉద్యోగులు ఆదర్శంగా తీసుకొని డిపో అభివృద్ధికి కృషి చేయాలని మేనేజర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి ఐ సారయ్య సిబ్బంది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ప్రతిరోజూ 30 నిమిషాల రీడింగ్ యాక్టివిటీ, యోగా

* **2026–27 అకడమిక్ క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రా ష్ట్ర పాఠశాల విద్యాశాఖ రూపొందించి న 2026-27 విద్యా సంవత్సర అకడ మిక్ క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ సందీ ప్ కుమార్ ఝా, సమీకృత జిల్లా కార్యా లయాల భవన సముదాయంలోని తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అకడమి క్ క్యాలెండర్‌ను కేవలం తేదీల పట్టికగా కాకుండా పాఠశాల విద్యా ప్ర ణాళికకు మార్గదర్శకంగా ఉపయోగించుకోవాల ని సూచించారు.క్యాలెండర్‌లో పేర్కొన్న కార్యక్రమాలను నిర్ణీత గడువుల్లో సమ ర్థవంతంగా అమలు చేయాలని ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూ చించారు. విద్యార్థులలో పఠన అలవా టు పెంపొందించేందు కు ప్రతిరోజూ 30 నిమిషాల రీడింగ్ యాక్టివిటీ, శారీరక, మానసిక ఆరోగ్యా నికి యోగా కార్యక్ర మాలు నిర్వహిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చే యాలని కలెక్టర్ సూచించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి: డీఎస్పీ అరుణ్ కుమార్

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం పట్టణంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు నిరంతరం చర్యలు చేపట్టాలని, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, బస్టాండ్, దేవాలయాల పరిసరాలు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ అరుణ్ కుమార్ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా డీఎస్పీ అరుణ్ కుమార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించి సిబ్బంది విధుల నిర్వహణపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పోలీస్ స్టేషన్ ఆవరణను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం నిర్వహించాలని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, సీట్ బెల్ట్ ధరించకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం



వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. డీఎస్పీ వెంట భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ తిరుపతి, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## దేశానికి, ధర్మానికి రక్షగా నిలుద్దాం

* **రామాలయంలో వైభవంగా రక్షాబంధన్ ఉత్సవం.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా కేంద్రం లోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవ స్థానంలో శనివారం సాయంత్రం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో రక్షాబం ధన్ ఉత్సవాలు వైభవంగా నిర్వహించా రు. భారీ సంఖ్యలో మహిళలు పాల్గొని పురుషులకు రాఖీలు కట్టి, సామూహి కంగా మంగళహారతులు నిర్వహించా రు. అనంతరం మిఠాయిలు పంచుకు న్నారు.ఈ సందర్భంగా డా.మోహన కృ ష్ణ భార్గవ మాట్లాడుతూ, "నేను మీకు రక్ష, మీరు నాకు రక్ష, మనందరం దేశా నికి, ధర్మానికి, సమాజానికి రక్షగా నిలు ద్దాం" అంటూ సంకల్పం చేయించారు. ప్రతి స్త్రీలో మాతృమూర్తిని, సోదరిని చూడాలని, మహిళల సమస్యల పరి ష్కారానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. యు వతీ యువకులు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌర వించి కాపాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో విశ్వహిం దూ పరి షత్ జిల్లా ఉపాధ్యక్షులు పాశం శ్రీశైలం, కోశాధికారి దిడిగం లక్ష్మణ్,కార్య దర్శి చిలువేరు హర్షవర్ధన్, మాతృ శక్తి సభ్యులు గజ్జెల అలివేలు, యెలసాని నాగమణి, జక్కా జ్యోతి, కృష్ణవేణి, శ్రీ వాణి, మంజుల, కవిత, సుజాత, శశి రేఖతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

* **మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు**



ప్రజాస్ఫూర్తి, భైంసా : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను నిర్మల్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశాలతో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా హాకీ అసోసియేషన్ సహ ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల అధికారి బి. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ భారత హాకీకి ప్రపంచస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో మేజర్ ధ్యాన్‌చంద్ చేసిన కృషి, ఆయన ప్రతిభ, అంకితభావం చిరస్మరణీయమని అన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు క్రీడా కోటా ద్వారా ప్రభుత్వంతో పాటు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. యువత తమ ప్రతిభను గుర్తించి క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రాథోడ్ లక్ష్మణ్, జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు పాకాల రాంచందర్, పీడీలు రమణారావు, రవీందర్‌గౌడ్, అన్నపూర్ణ, భూమన్న, సత్తయ్య, బుచ్చిరామారావు, సుధార్‌సింగ్, పోశెట్టి, వంశీ, కె. శ్రీనివాస్, పీఈటీలు సంజీవ్, గంగాధర్, ముకేష్, భీమేశ్, గిరి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, యువత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోంది

* **భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజా స్ఫూర్తి : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం ఘనపూర్ మండలంలోని పలు గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వెంకటేశ్వర్లపల్లి, అప్పాయిపల్లి గ్రామాల్లో వీవో సంఘం భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. చెల్పూర్, గొల్లపల్లి, బసరాజ్‌పల్లి, పరశురాంపల్లి, ధర్మారావుపేట, వెంకటేశ్వర్లపల్లి, నగరంపల్లి, కొండాపూర్, సీతారాంపూర్, అప్పాయిపల్లి, ఘనపూర్, బురకాయలగూడెం, గాంధీనగర్, మైలారం, లక్ష్మారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలనలో కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎదురుచూసే పరిస్థితి ఉండేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధిస్తే కుటుంబాలతో పాటు గ్రామాలు కూడా అభివృద్ధి చెందుతాయని అన్నారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల నాయకులు, లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిగురుమామిడి రైతువేదికలో రైతులకు ఆత్మ శిక్షణ కార్యక్రమం



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి: మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం రైతులకు ఆత్మ ఆర్ పిఎల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.వరి సాగులో ఆధునిక పద్ధతులు,తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమం జరిగిందని వ్యవసాయ శాఖ మండల అధికారి తాటిపల్లి పున్నమి చందర్ రెడ్డి తెలిపారు.ఈ శిక్షణలో ముఖ్య అతిథిగా ఆత్మ పిడి చత్రు నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వరి పంటలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అందించే 7రకాల సన్నరకాల వంగడాల గురించి రైతులకు వివరించారు. వరి సాగులో శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు,కాలానుగుణంగా వచ్చే పురుగులు,తెగుళ్ల యాజమాన్యం,సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించారు.మరో ముఖ్య వక్త, బి.జె.ఆర్ అగ్రికల్చర్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్,శాస్త్రవేత్త శ్రీ హరికృష్ణ మాట్లాడుతూ వరి పంటలో నాణ్యమైన దిగుబడులు సాధించడానికి పంట దశల వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.సన్న రకాల ఎంపిక, శాస్త్రీయ ఎరువుల యాజమాన్యంపై రైతులకు దిశానిర్దేశం చేశారు.పంటలను ఆశించే పురుగులు,తెగుళ్లను ముందుగానే గుర్తించి, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని ఆయన సూచించారు. అనంతరం రైతులు అడిగిన పలు సందేహాలను అధికారులు, శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా వరి పంటలో అధిక దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తి,మెరుగైన ఆదాయాన్ని సాధించవచ్చని అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చిగురుమామిడి గ్రామ సర్పంచ్ ఆకవరం భవాని,మండల వ్యవసాయ శాఖ అధికారి పున్నం చందర్ రెడ్డి,ఏటీఎం అర్చన,వ్యవసాయ విస్తరణ అధికారులు,చిగురుమామిడి మండల పరిధిలోని పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ సర్పంచులు

* **ప్రజా సంక్షేమ పథకాలతో ఆకర్షితులై చేరిక.. ఎమ్మెల్యే జీఎస్సార్**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. శనివారం భూపాలపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో చిట్యాల మండలం రామచంద్రాపూర్ సర్పంచ్ గాజా హేమలత అశోక్, కైలాపూర్ సర్పంచ్ కోదారి ఓదెలుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, పేదల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రతి గ్రామానికి సమాన ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. కాంగ్రెస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో చిట్యాల మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## టైగర్ జోన్ రద్దు చేయాలిఎకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలి

**ఏడవ రోజుకు చేరిన భూమాచారి దీక్ష**



ప్రజాస్ఫూర్తి ,జన్నారం : జన్నారం డివిజన్ లోని కవ్వాల్ టైగర్ జోన్ పూర్తిగా రద్దు చేసి ఎకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన శ్రీరాముల భూమా చారి చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం నాటికి ఏడవ రోజుకు చేరుకుంది.పండగలను కూడ పక్కనపెట్టి, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మండల అభివృద్ధి కోసం శ్రీరాముల భూమాచారి రిలే నిరాహార దీక్ష చేపట్టాడు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ జోన్ ను పూర్తిగా రద్దు చేసి, ఎకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 2012లో కవ్వాల్ టైగర్ జోన్ గా ప్రకటించారని, ఇప్పటికి 14 సంవత్సరాలు గడిచిన కానీ పులుల జాడ మాత్రం లేదని అన్నారు. అలాగే ఎకో సెన్సిటివ్ జోన్ తో విధించిన ఆంక్షలు వల్ల ఇసుక కొరతతో సిసి రోడ్ల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పలు నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గుడిహత్నూర్ నుండి జన్నారం మీదుగా కరీంనగర్ వరకు నాలుగు వరసల జాతీయ రహదారిని ఏర్పాటు చేయాలని, అడవిని కాపాడవలసిన అటవీ శాఖ అధికారులను ఇసుక పేరుతో సస్పెండ్ చేశారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అటవీ శాఖ 41 రోజుల వరకు స్పందించకపోతే ఆ తర్వాత ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు.

## రోడ్డు బాగుచేయాలని నిరసన



దుండిగల్,ప్రజాస్ఫూర్తి : దుండిగల్ డివిజన్ పరిధిలోని గండిమైసమ్మ నుంచి పోచంపల్లి దుండిగల్ వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయం కావడంతో నిరసనకు దిగారు బీజేపీ నాయకులు.రోడ్డు మొత్తం గుంతల మయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు ఆనబోయిన మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు.అధికారులు వెంబడే స్పందించి రోడ్డుని సరి చేసి డ్రైనేజీ రోడ్లపై పొర్లకుంటా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ బీజేపీ అధ్యక్షులు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూములమ్మి వేల కోట్లు పోగేస్తుందనీ అయినా హైదరాబాదులో సమస్యలు అలాగే ఉన్నాయని విమర్శించారు.కార్యక్రమంలో మోహన్ రెడ్డి,మధు,మైపాల్ రెడ్డి, రాజేందర్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీఎమ్మెల్యే సతీష్ కుమార్



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన పలువురి కుటుంబాలను హుస్నాబాద్ నియోజకవర్గ మాజీఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ శనివారం పరామర్శించారు.మండల కేంద్రానికి చెందిన కోనేటి వెంకవ్వ,సీతారాంపూర్ గ్రామానికి చెందిన ముస్కుల వెంకటరెడ్డి,ఇందుర్తికి చెందిన బల్ల రాములు,గౌరవెల్లి లచ్చమ్మ, రామంచ గ్రామానికి చెందిన నర్రా జగదీశ్వర్ రెడ్డి కుటుంబాలను ఆయన స్వయంగా కలిసి వారి మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.బాధితులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తూ పార్టీ మీకు ఎల్లప్పుడూ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చి ధైర్యాన్ని కల్పించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ ఒంటెల కిషన్ రెడ్డి,మాజీవైస్ఎంపీపీ బేతి రాజిరెడ్డి,మండల ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు, ఉపసర్పంచ్ లు కాశబోయిన విజయలక్ష్మి రాజు యాదవ్,గీట్ల తిరుపతిరెడ్డి,వార్డ్ మెంబర్ తాటికొండ అభిషేక్ రెడ్డితోపాటు యూత్ అధ్యక్షులు తాటికొండ సందీప్ రెడ్డి,సీనియర్ నాయకులు అందె సుజాత పోచయ్య,అందె రాయమల్లు, మహంకాళి కొమురయ్య,శ్యామకూర సంపత్ రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షులు ఎస్కే సిరాజ్,పరిపాటిరవీందర్ రెడ్డి,బిల్లా వెంకట్ రెడ్డి,చెరుకు సంజీవ్,మాజీ అధ్యక్షులు రాజేందర్ రెడ్డి,తదితర ముఖ్య నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావం.. పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు



జనగామ, ప్రజాస్ఫూర్తి : ఎల్‌నినో ప్రభా వంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యం లో రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల నిర్వహణ చేప ట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూ చించారు. శనివారం ఘనపూర్, జఫర్ గఢ్ మండలాల్లోని పలు గ్రామాల్లో పం ట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం రైతులకు క్షేత్రస్థాయిలో సాంకే తిక సలహాలు అందించింది.తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ వి. రమ్య, ప్రాంతీయ వ్యవసాయ పరి శోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పి.గోన్యానాయక్, మండల వ్యవసాయ అధికారి చంద్రన్‌కుమార్‌లు వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, నువ్వులు, కంది తదితర పంటలను పరిశీలించా రు. పంటల్లో కలుపు, జింక్ లోపంతో పాటు పత్తిలో రసం పీల్చే పురుగులు, వైరస్ తెగుళ్ల ఉధృతి ఉన్నట్లు గుర్తించి, తగిన మందుల వినియోగంపై రైతుల కు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారులు శ్వేత, అనితతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు కూలిన ఇంటి పైభాగం..

* **తప్పిన ప్రాణాపాయం...**



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి: శిథిలావస్థలో ఉన్న పాత ఇల్లు పైకప్పు భాగం కూలి పెను ప్రమాదం తప్పింన సంఘటన శనివారం ఉదయం నవాబుపేటలో చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన బోయిని రామయ్య ఉదయం దాదాపు 5 గంటల సమయంలో నిద్ర లేచి బయటకు వెళ్లే సమయంలో తన ఇంటి పైకప్పు భాగం ప్రమాదవశత్తు కూలిపోయిందని ఆ శబ్దానికి ఒక్కసారిగా నిద్రలో నుంచి మేల్కొని కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి తమ పక్కనే ఇంటి పైకప్పు భాగం కూలి పడడంతో భయభ్రాంతులకు గురై ఉలిక్కిపడ్డామని ఆ సమయంలో ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఇంటి లోపల నుండి పరుగు పరుగున బయటికి పరిగెత్తామన్నారు.ఎన్నో ఏళ్ల నుండి మట్టి గోడలు కుమ్మరి పెంక,పాలిథిన్ కవర్లతో కప్పబడి తమ ఇల్లు శిథిలావస్థలో ఉందని ప్రతి వర్షాకాలం సీజన్లో గోడలు తడుస్తూ ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో తామున్నామన్నారు.గతంలో అధికారులకు సమాచారం అందించినా ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు దరఖాస్తు చేసుకున్నా కానీ తమకు ఇల్లు మంజూరు చేయలేదని బాధితుడు రామయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.రెవెన్యూ అధికారులకు,గ్రామ సర్పంచ్ కు సమాచారం అందించగా జిపిఓ శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని కూలిపోయిన ఇల్లును పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు ప్రస్తుతం ఇల్లు పై కప్పు కూలడంతో నిరాశ్రయులుగా ఉన్న తమకు ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

# ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభలో పదవులు పొందిన నాయకులకు సన్మానం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట ఆర్యవైశ్య నాయకులు కలకోట లక్ష్మయ్య ఆద్వర్యంలో ఇటీవల రాష్ట్ర కార్యవర్గంలో నూతనంగా పదవులు పొందిన పొలిటికల్ వైస్ చైర్మన్ వెంపటి సురేష్, ప్రచార సమితి వైస్ చైర్మన్ తప్పి గాంధీ, యువజన విభాగం ఉపాధ్యక్షులు వెంపటి శబరినాథ్, పొలిటికల్ కార్యదర్శి దేవరశెట్టి సత్యనారాయణలను శాలువాలతో సన్మానించారు. శనివారం సాయంత్రం నరేందర్ మ్యారెజ్ లైన్స్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమం లో పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలోని ఆర్యవైశ్యులందరూ ఐకమత్యంగా కలిసిమెలిసి పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలకోట లక్ష్మయ్య, పోతుగంటి వెంకటేశ్వర్లు, వెంపటి పురుషోత్తం, కుక్కడపు శ్రీనివాస్, చల్లా సత్య నారాయణ(కిరాణం), బూర్లే రామ్మూర్తి, గొడిశాల శంకర్, కొండా శ్రీనివాసరావు,బెలిదె శ్రీను(బంకు), శ్రీరంగం రాము, బ్రాహ్మణపల్లి సంతోష్, బెజగం ఫణి, కాసం రమేష్, పాలవరపు శ్రీశైలం,సోమ ఉపేందర్, తల్లాడ వెంకటేశ్వర్లు, కొత్త వెంకన్న, తేరటిపల్లి సతీష్, కందిబండ ఉమా మహేశ్వరరావు, గుండా రమేష్, ముకుందం, చల్లా సత్యనారాయణ, పబ్బతి వేణుమాధవ్, పబ్బతి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంటు బకాయిలను వెంటనే విడుదల చేయాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం మహబూబాబాద్ పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు.బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లపు వెంకటేశ్వర్లు,బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దిడ్డి మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళనలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు,బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దిడ్డి మహేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదల కోసం బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్‌లో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దిరాజు రామచంద్రరావు,గడ్డం అశోక్ కుమార్,ఇందు భారతి,సురేష్ నాయక్,26వార్డు కౌన్సిలర్ శ్రీదేవి,శ్యాం కుమార్,వెంకన్న బీజేపీ,బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిజెపి బూత్ అధ్యక్షులు బూత్ బి ఎల్ ఎ2 ప్రధాన బాధ్యతగా పనిచేయాలి

* **సిద్దిపేట బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : సర్ డ్రాఫ్ట్ ఓటర్ జాబితా అనంతరం సర్ రెండవ విడత కార్యక్రమంపై హుస్నాబాద్ అసెంబ్లీ స్థాయి బిజెపి బూత్ అధ్యక్షులు బి ఎల్ ఎ2 ల అవగాహన సమావేశం బిజెపి అసెంబ్లీ కన్వీనర్, గుర్రాల లక్ష్మారెడ్డి అధ్యక్షతన హుస్నాబాద్ పట్టణంలోని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ విశిష్ట అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజెపి సర్ జోనల్ ఇన్‌చార్జి కటకం ఆంటోనీ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ మాట్లాడుతూ సర్ ప్రక్రియలో ప్రతి అర్హుడైన భారతీయ పౌరుడి ఓటు హక్కు పరిరక్షించడమే బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల ప్రధాన బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఎన్. మోహన్ నాయక్, హుస్నాబాద్ అక్కన్నపేట మండలాల అధ్యక్షులు భూక్య సంపత్ నాయక్, రామంచ మహేందర్ రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను చెల్లించడంలో ప్రభుత్వం విఫలం

* **బిజెపి జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఫీజు బకాలను తక్షణమే విడుదల చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి డిమాండ్ చేశారు. బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షురాలు అధ్యక్షతన ఫీజుల బకాయి బిజెపి లడాయి నిరసన దీక్ష ను బీజేవైఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ వద్ద శనివారం నిర్వహించారు. ఈ నిరసన దీక్ష కు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడియం రామచంద్రయ్య, రంగరాజు రుక్మారావు, బొబ్బ భాగ్యరెడ్డి, ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.40 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను సుమారు 15వేల కోట్ల రూపాయల పాత బకాయిలను చెల్లించడం లేదని ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులకు వేతనాలు చెల్లించలేక, అద్దెలు చెల్లించలేక, అనేక డిగ్రీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్,తదతర కళాశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పాత బకాయిలను తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని ధ్వజమెత్తారు. విద్యార్థులు, యువత సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడుతుందని చెప్పారు. ఈ నిరసన దీక్షకు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు సంఘీభావం ప్రకటించాయి.ఈ కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర నాయకులు పాదూరి కరుణ, తుక్కాని మన్మధ రెడ్డి, సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు బూర మల్సూర్ గౌడ్, బీజేవైఎం అధ్యక్షులు పృధ్వి గౌడ్, వైస్ ప్రెసిడెంట్ భరత్ నాయుడు, కిసాన్ మోర్చా అధ్యక్షులు కంచర్ల నరసింహ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు నాగేంద్ర చారి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బొజ్జ పరశురాం, ఎస్టి మోర్చా అధ్యక్షుడు సక్రు నాయక్, జిల్లా నాయకులు చల్లమల్ల నరసింహ, పాండురంగాచారి, కందుల రమేష్, మంజుల, కోడి లింగయ్య,దాసరి వెంకన్న,బాలాజీ నాయక్, యాదగిరి, కిరణ్, మంజుల,రవి నాయక్, వివిధ మండలాల అధ్యక్షులు, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల మరమ్మతులు,పెండింగ్ పనులు పూర్తి చేయాలి

* **పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ అధికారులతో ఎమ్మెల్యే మురళి నాయక్ సమీక్ష**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ నియోజకవర్గంలోని రోడ్ల మరమ్మతులు,పెండింగ్‌లో ఉన్న పనులు,నూతన రహదారుల నిర్మాణం తదితర అంశాలపై మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. శనివారం మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ ఈఈ,ఆర్అండ్‌బీ ఈఈతో పాటు సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై నియోజకవర్గంలోని రహదారుల పరిస్థితిపై సమగ్రంగా చర్చించారు. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలు,మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం మెరుగుపరచడంపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా దృష్టి సారించారు.రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా రహదారి నిర్మాణం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న మారుమూల గ్రామాలకు కొత్త రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రపోజల్స్ (ప్రతిపాదనలు) సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు.అవసరమైన చోట్ల హై లెవల్ బ్రిడ్జిలు,కల్వర్టులు,ఇతర మౌలిక వసతుల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు తెలిపారు. వర్షాకాలంలో రోడ్లు దెబ్బతినకుండా,ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు,సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్సిసి సెలక్షన్స్

* **ప్రిన్సిపల్ ప్రొఫెసర్ హుస్సేన్**




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ లో ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులకు ఎన్సిసి లో చేరుటకు ఎంపిక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించినట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ హుస్సేన్ తెలిపారు. ఈ విద్యా సంవత్సరం బిఏ, బీకాం, బీఎస్సీ కోర్సులలో ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఎన్సీసీలో చేరుటకు వివిధ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. రన్నింగ్, పుషప్స్, బార్ పుషప్స్ వంటి పోటీలలో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పోటీలలో 50 మంది అమ్మాయిలు ఎంపిక కాగా 44 మంది అబ్బాయిలు ఎంపిక అయినట్టు ఎన్సిసి ఇన్చార్జ్ ఆఫీసర్ సురేందర్ రావు తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమానికి సంగారెడ్డి నుండి ఆర్మీ అధికారులు నాయక్ సుబేదార్ అప్పాజీ కోలే మరియు హవల్దార్ అమిత్ రాయ్ పరిశీలకులుగా వచ్చారు.

# క్రీడల పట్ల యువత ఆసక్తి కనపరచాలి

**హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి**

హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ పట్టణంలో పురపాలక సంఘ ఆధ్వర్యంలో మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి పురపాలక సంఘ పాలకవర్గ సభ్యులు అధికారులు, సిబ్బంది క్రికెట్ క్రీడా పోటీలో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పురపాలక సంఘ చైర్పర్సన్ దండి లక్ష్మి హాజరైఆయన క్రీడా రంగానికి చేసిన అసమాన సేవలను స్మరించుకుంటూ భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజును జాతీయ క్రీడా దినోత్సవంగా ప్రకటించిందని,ఈ సందర్భంగా క్రీడాకారులకు ఇచ్చే అత్యున్నత పురస్కారానికి 'మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డు'గా పేరు మార్చి ఆయనను గౌరవించుకున్నామని,నేటి యువత ధ్యాన్ చంద్ ని స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలని ఆమె కోరారు. అనంతరం క్రికెట్ గేమ్ లో గెలిచిన జట్టుకు ట్రోఫీ అందించడం జరిగింది. పాలకవర్గ సభ్యుల కు షీల్డ్ తో బహుకరించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున్ ,వైస్ చైర్ పర్సన్ చిత్తారి పద్మ , కౌన్సిలర్స్ అనూష, లత, రజిత తిరుపతి బొలిశెట్టి రాజు సంపత్ సరిత,గడిపే సంపత్, మంజుల వరప్రసాద్, రమేష్ శ్రీనివాస్ రజిత కిరణ్ ప్రసాద్ గాదెపాక రవీందర్ ,సుప్రజ బత్తుల స్వరూప, శోభన్ బాబు కో ఆప్షన్ సభ్యులు లావణ్య హసన్, సరోజన, గ్లోరిన ప్రజా ప్రతినిధులు రమణ మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు పూర్తయ్యే వరకు ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తాం

* **మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: నందగోకుల్ -చెల్మెడ కమాన్ రహదారి కోసం చేపట్టిన పాదయాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాదయాత్రకు భారీగా తరలివచ్చి మద్దతు తెలిపిన ప్రజలకు శిరసు వంచి నమస్కరిస్తున్నానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలకు, రైతులకు, మహిళలకు, యువతకు, విద్యార్థులకు, బిఆర్ఎస్ కుటుంబ సభ్యులకు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ప్రజల సమస్య కోసం నిర్వహించిన పాదయాత్రకు ఇంతటి భారీ స్పందన రావడం ఎంతో సంతోషంగా ఉందని, ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్య తీవ్రతను ఈ పాదయాత్ర ప్రభుత్వానికి మరోసారి తెలియజేసిందన్నారు. నందగోకుల్ -చెల్మెడ కమాన్ రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. రోడ్డు పూర్తయ్యే వరకు మా పోరాటం కొనసాగుతుందన్నారు. పాదయాత్రను విజయవంతం చేసేందుకు ప్రత్యక్షంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మరోసారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వాహనాల వేలంపాట తేది మార్పు

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : సెప్టెంబర్ 01,2026 న మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్లో జరగాల్సిన వివిధ నేరాలలో పట్టుబడినటువంటి వాహనాల వేలం జిల్లా ఎక్సైజ్ అధికారి పి. కరంచంద్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 2, 2026న మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో నిర్వహించడం జరుగుతుంది. జి.చిరంజీవి ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, మహబూబాబాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

# జపాన్ విద్యా పర్యటనకు కెరమెరి హెచ్ఎం కదేర్ల రంగయ్య ఎంపిక



కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్జాతీయ విద్యా పర్యటన (జపాన్ ఎక్స్‌పోజర్ విజిట్)కు కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం సావర్ ఖేడ్ ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కదేర్ల రంగయ్య ఎంపికయ్యారు. సెప్టెంబర్ 5 నుంచి 12 వరకు జరిగే ఈ పర్యటనలో రాష్ట్రం నుంచి మొత్తం 30 మంది ఉపాధ్యాయులు, 10 మంది అధికారులు పాల్గొననున్నారు. జపాన్‌లో అమలవుతున్న ఆధునిక విద్యా విధానాలు, బోధన పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల్లో క్రమశిక్షణ మరియు నైపుణ్యాభివృద్ధి వంటి ఉత్తమ అంశాలను అధ్యయనం చేసి, మన రాష్ట్ర విద్యావ్యవస్థలో అమలు చేయడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం. కాగా, రంగయ్య ఎంపికపై హైదరాబాద్‌లోని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ శనివారం సమాచారం అందించగా, గ్రామీణ ప్రాంత పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి ఈ అవకాశం దక్కడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. జపాన్ పర్యటన ద్వారా తెలుసుకున్న ఆధునిక విద్యా పద్ధతులను స్థానిక పాఠశాలలో అమలు చేసేందుకు కృషి చేస్తానని హెచ్ఎం రంగయ్య పేర్కొన్నారు.

# త్రివేణి లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : లక్ష్మీదేవి పల్లి మండలం లో గల త్రివేణి పాఠశాల ప్రాంగణంలో హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు . ముందుగా ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు . ఈ సందర్భంగా త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపూడి జగదీష్ మాట్లాడుతూ ఆయన అద్భుతమైన ఆట తీరుతో మన దేశ కీర్తిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పారని , ఆయన సాధించిన విజయాలను ఆయన కృషి , పట్టుదలను విద్యార్థులకు వివరిస్తూ ఆయన హాకీ క్రీడకు అందించిన సేవలను కొనియాడారు . ఈ కార్యక్రమంలో సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ , ప్రిన్సిపల్స్ సూర్యనారాయణ మూర్తి , శ్రీనివాస్ సింగ్ ,నేతాజీ , వైస్ ప్రిన్సిపల్ సౌజన్య , పీఈటీలు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు .

# ఆదర్శ పాఠశాలలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలు



లింగాల ఘణపురం/జనగామ, ప్రజా స్ఫూర్తి : మండల కేంద్రంలోని తెలంగా ణ ఆదర్శ పాఠశాలలో గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి సంద ర్భంగా తెలుగు భాషా దినోత్సవం,మేజ ర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మహనీయుల చిత్రపటాలకు పూలమా లలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో బాలసభ (బా లల విజ్ఞాన వేదిక)ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులే నిర్వాహ కులుగా వ్యవహరిస్తూ తమ ప్రతిభను ప్రదర్శించారు. జానపద నృత్యాలు, శా స్త్రీయ నృత్యాలు, ఆంగ్ల సంభాషణలు, కథలు చెప్పడం, పొడుపు కథలు, పాట లు పాడడం వంటి విభిన్న అంశాలలో విద్యార్థులు ఆకట్టుకునే ప్రదర్శనలు ఇచ్చారు. వివిధ అంశాల్లో ఉత్తమ ప్రతి భ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి జి.సునీత బహుమ తులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ఉపాధ్యాయు లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నీలం వంశీ కుటుంబానికి ఎస్‌పీకే సాగర్ అండ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి: శాంతినగర్‌కు చెందిన నీలం వంశీ తల్లి ఇటీవల మృతి చెందడంతో వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి, నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ ఎస్‌పీకే సాగర్ కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు సోదరులు గంధం సింధు, రాజేందర్, జస్వంత్, కళ్యాణ్ తదితరులు వంశీ కుటుంబానికి 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పీకే సాగర్ మాట్లాడుతూ.. కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

# గ్రామీణ ప్రజల సమస్యలకు పరిష్కారమే భూభారతి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: గ్రామీణ ప్రాంతాలలో భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయం లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి నల్గొండ జిల్లా రెవిన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, గృహ నిర్మాణ శాఖల సమీక్ష సమావేశానికి హాజరైన మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రజలకు ఒక మంచి చట్టాన్ని తీసుకువచ్చి భూముల విషయంలో వారికి ఎక్కడా ఇబ్బందులు కదగకుండా చూడాలన్నదే తమ ధ్యేయమని చెప్పారు. 125 సంవత్సరాల క్రితం తెలంగాణ రాష్ట్రంలో భూమి సర్వే నిర్వహించడం జరిగిందని, తదుపరి ఇంత పెద్ద మొత్తంలో ఎప్పుడు సర్వే చేయలేదని అన్నారు. సర్వే చేయని కారణంగా గ్రామీణ ప్రాంతంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, సహచర మంత్రి వర్గ సభ్యులు, శాసన సభ్యులు, శాసనమండలి సభ్యుల ఆలోచనల మేరకు మొదటి విడత రాష్ట్రవ్యాప్తంగా 70 గ్రామాలలో సర్వే చేసేందుకు ప్రణాళిక ఏర్పాటు చేసుకొని సర్వే నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. అయితే గ్రామాలలో నిర్వహిస్తున్న సర్వే ఎలా జరుగుతుందో విశ్లేషించడంలో భాగంగా వివిధ జిల్లాలలో ప్రత్యక్షంగా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసిల్దార్లు, రెవెన్యూ అధికారులతో మాట్లాడి వివరాలను తెలుసుకోవడం జరుగుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్, ఇతర శాసనసభ్యులు, తదితరులు మంత్రి వెంట ఉన్నారు

# అమర్‌గొండలో భూ రీసర్వే పరిశీలన

*** పాఠశాలలు, ఓటర్ల సవరణపై కలెక్టర్ కె.హరిత సమగ్ర తనిఖీ**



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి :దహెగాం మండలంలోని అమర్‌గొండ గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ కె. హరిత శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, భూ సరిహద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అత్యాధునిక జీఎన్ఎస్ఎస్ రోవర్ పరికరాల పనితీరు, గ్రామ పొలిమేరలు, ప్రభుత్వ భూములను స్వయంగా తనిఖీ చేసిన అనంతరం రైతులు, గ్రామస్థులతో ముఖాముఖి మాట్లాడి వారి అభ్యంతరాలను స్వీకరించారు. అనంతరం ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్.. జిల్లాలో మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఉన్న 1,05,829 మంది ఓటర్లకు బీఎల్ఓల ద్వారా త్వరితగతిన హియరింగ్ నోటీసులు అందించి, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశించారు. ఇదే పర్యటనలో భాగంగా చిన్న రాష్పల్లి ఎం.పి.పి.ఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, మౌలిక వసతులు మరియు విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించి, ప్రభుత్వ పాఠశాలల్లో 100% విద్యార్థుల హాజరే లక్ష్యంగా ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలని, ఆంగ్ల మాధ్యమ నాణ్యమైన విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సర్వే సహాయ సంచాలకులు వినయ్‌కుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రామేశ్వర్, మండల సర్వేయర్ ధన్‌రాజ్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత పరీక్షా మెటీరియల్ అందజేత



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: స్ఫూర్తి ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ తెలుగు సేవా సమితి ఆఫ్ నేబ్రాస్కా కంటేము నవీన్ వారి ఆధ్వర్యంలో శనిగపురం ఉన్నత పాఠశాల.యందు ఎస్.ఎం.ఎం. ఎస్ రాయబోయే ఎనిమిదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయా పాఠశాలప్రధానోపాధ్యాయులు బి.సిరినాయక్ డి శ్రీధర్ మాట్లాడుతూ స్ఫూర్తి ఫౌండేషన్ వారు ప్రభుత్వ పాఠశాలలో చదువే పేద పిల్లలపై చూపించే ఔదార్యానికి కృతజ్ఞతలు తెలపడం జరిగింది. అదేవిధంగా స్ఫూర్తి ఎడ్యుకేషన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు రామసహాయం శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద పిల్లలకు సహకారం అందించాలని ఉద్దేశంతో ఈ పుస్తకాలు అందివ్వడం జరుగుతుందని ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంటర్మీడియట్ వరకు ప్రతి సంవత్సరం 12000 చొప్పున స్కాలర్షిప్ వస్తుందని, విద్యార్థులు బాగా చదివి స్కాలర్ షిప్ సాధించాలి అన్నారు, ఈ కార్యక్రమంలోప్రధాన కార్యదర్శి మేకల కృష్ణయ్య, ఉపాధ్యాయులు వాసుదేవ్ రవీందర్, బొక్క వెంకట్ రెడ్డి ,చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని



*** కలెక్టర్ ప్రతిమా సింగ్**

ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా:జాతీయ క్రీడా దినోత్సవ సందర్భంగా శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని వెల్కమ్ బోర్డు చౌరస్తా నుండి ధ్యాన్చంద్ చౌరస్తా వరకు పురుషులకు ఐదు కిలోమీటర్ల రన్నింగ్, అలాగే మెదక్ కొత్త బస్టాండ్ నుండి ధ్యాన్చంద్ చౌరస్తా వరకు బాలికలకు రెండు కిలోమీటర్ల రన్నింగ్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ జెండా ఊపి ప్రారంభించారు. 5 కిలోమీటర్ల రన్నింగ్ లో పాల్గొని విజయవంతంగా పూర్తి చేసిన క్రీడాకారులు , క్రీడాభిమానులలో స్ఫూర్తిని ఉత్సాహాన్ని నింపిన మెదక్ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ మహేష్.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినం సందర్భంగా దేశ వ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. మన మెదక్ జిల్లాలో జాతీయ క్రీడ దినోత్సవాన్ని ఇంత ఘనంగా నిర్వహించుకోవడం శుభపరిణామం అని పేర్కొన్నారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. క్రీడాకారుల విద్యార్థులు జాతీయస్థాయి, రాష్ట్రస్థాయిలు రాణిస్తున్నారని పేర్కొన్నారు.క్రీడలలో రాణించిన వారికి ఉద్యోగ అవకాశాలు కూడ లభిస్తాయి అన్నారు. అనంతరం ధ్యాన్చంద్ చౌరస్తా వద్ద ఇన్చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, మెదక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షులు జుబేర్ అహ్మద్ , స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ శివ,డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ మహేష్,పాల్గొని ధ్యాన్చంద్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం క్రీడాకారులు క్రీడాభిమాను ఉద్దేశించి వక్తలు తమ సందేశాలను వినిపించారు.విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం, సమష్టి తత్వం పెంపొందించడమే లక్ష్యంగా పురుషులకు ఐదు కిలోమీటర్ల, బాలికలకు రెండు కిలోమీటర్ల రన్నింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదగా మెడల్స్ అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు,మెదక్ జిల్లా పాఠశాల క్రీడా సమైక్య కార్యదర్శి నాగరాజు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ఆనందం,ఫుట్బాల్ కోచ్ వినయ్, వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే ఫిర్యాదు చేయండి

*** జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజాస్ఫూర్తి: అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల ఎంపిక, చేరిక ప్రక్రియ పూర్తిగా ఉచితమని, పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా నిర్వహిస్తున్నామని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. దరఖాస్తు నుంచి పోస్టింగ్ వరకు అభ్యర్థులు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు.ఉద్యోగంలో చేర్పిస్తామని చెప్పి ఎవరైనా డబ్బులు లేదా ఇతర ప్రయోజనాలు డిమాండ్ చేస్తే అది తీవ్రమైన నేరమని కలెక్టర్ హెచ్చరించారు. ఇటువంటి చర్యలు అవినీతి నిరోధక చట్టం-1988, భారతీయ న్యాయ సంహిత-2023 ప్రకారం శిక్షార్హమని పేర్కొన్నారు.ఉద్యోగాల పేరుతో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే బాధితులు వెంటనే జిల్లా కలెక్టర్ కార్యాలయం టోల్‌ఫ్రీ నంబర్ 18004256605 లేదా తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని కోరారు.ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, ఫిర్యాదు చేసిన కారణంగా ఉద్యోగ ఎంపికపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ వ్యవహారంలో ఏ ప్రభుత్వ ఉద్యోగి ప్రమేయం ఉన్నట్లు తేలినా తక్షణమే సస్పెండ్ చేయడంతో పాటు శాఖాపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఆవిష్కరణలే పోలీసింగ్‌కు దిక్సూచి



హైదరాబాద్: నేరాల స్వరూపం వేగంగా మారుతున్న నేపథ్యంలో కృత్రిమ మేధ](ఏఐ) సహా ఆధునిక సాంకేతికతలతో కూడిన ఆవిష్కరణలే పోలీసింగ్‌కు దిక్సూచిలా నిలుస్తాయని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు. తెలంగాణ పోలీసులు దేశంలో ముందంజలో ఉండాలంటే క్రిమినల్ నెట్‌వర్క్ ట్రాకింగ్ సిస్టమ్ (సీసీటీఎన్ఎస్), అపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ (ఐసీజేఎస్)లను నిరంతరం అప్‌డేట్ చేస్తూ.. సమర్థంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో అన్ని విభాగాల పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన కీలకోపన్యాసం చేశారు. పోలీస్‌శాఖలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక ఆధారిత అప్లికేషన్లను మరింత విస్తృతంగా వినియోగించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. డిజిటల్ పోలీసింగ్ వ్యవస్థకు ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారాన్ని జోడించాలని సూచించారు. కోర్టు కేసుల నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నిర్దేశించారు. దర్యాప్తు, కోర్టు విధానాలు, న్యాయపరమైన అంశాలపై పోలీసులకు నిరంతరం శిక్షణ అవసరమని అభిప్రాయపడ్డారు. రాష్ట్రస్థాయిలో నేర నియంత్రణకు సంబంధించిన ప్రమాణాల అమలులో ప్రతిభ కనబరిచిన పోలీస్ విభాగాలను అభినందించారు. క్లస్టర్ 1లో హైదరాబాద్, క్లస్టర్ 2లో రామగుండం, క్లస్టర్ 3లో నల్గొండ, క్లస్టర్ 4లో సూర్యాపేట ప్రథమ స్థానాల్లో నిలవడంతో ఆయా విభాగాల అధికారులను సత్కరించారు. ఏఐ ఆధారిత అప్లికేషన్లను రూపొందించి పోలీస్ శాఖ అంతర్గత సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు కృషిచేస్తున్న యువ ఐపీఎస్‌ల సేవలను కొనియాడారు.అనంతరం 2013 బ్యాచ్, ఆపై బ్యాచ్‌లకు చెందిన ఐపీఎస్ అధికారులతో డీజీపీ సమావేశమయ్యారు. నాయకత్వ లక్షణాలు, కొత్త చట్టాల అమలు, ఈసాక్ష్య, ఈఫోరెన్సిక్, ఐసీజేఎస్ అనుసంధానం, జాతీయస్థాయి పోర్టళ్లలో తెలంగాణ పనితీరును ఈ సందర్భంగా సమీక్షించారు. సమావేశంలో డీజీపీలు మహేశ్‌భగవత్, సౌమ్యమిశ్రా, అభిలాష బిస్త్, శిఖాగోయెల్, చారుసిన్హా, హైదరాబాద్ కమిషనర్ వీసీ సజ్జనర్, ఈగల్ డైరెక్టర్ సందీప్‌శాండిల్య తదితరులు పాల్గొన్నారు.

# ఎంఐఎంలో సంచలనం.. చర్చనీయాంశంగా ఎమ్మెల్సీ రహమత్‌పై వేటు

హైదరాబాద్; ఆబిడ్స్, రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: మజ్లిస్ ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరించిన సంఘటన సంచలనం సృష్టించింది. ఆయన పదవీ కాలం 2029 వరకు ఉండగా.. తక్షణమే రాజీనామా చేయాలని ఆ పార్టీ శుక్రవారం రాత్రి ఆదేశించడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. పార్టీ నుంచి బహిష్కరించడం, పదవికి రాజీనామా చేయాలని ఆదేశాలు జారీ చేయడం మజ్లిస్ చరిత్రలోనే తొలిసారి. ప్రస్తుతం రహమత్ బేగ్ అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. శాసనమండలి ఛైర్మన్‌కు రాజీనామా సమర్పించకపోవడం ఈ అనుమానాలకు బలం చేకూరుతోంది. రాజేంద్రనగర్ ప్రాంతంలో ఒక సంఘటన జరిగిందంటూ ఐదు రోజుల క్రితం సామాజిక మాధ్యమాల్లో ఒక అశ్లీల వీడియో వైరల్ అయింది. అందులో ఎమ్మెల్సీ బేగ్ ఉన్నారు. అది తీవ్ర దుమారం రేపింది.

# ఓటర్లను నేరుగా కలిసి నోటీసులు ఇవ్వాలి



హైదరాబాద్: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)లో భాగంగా ఓటర్లను పోలింగ్ బూత్ స్థాయి అధికారులు(బీఎల్‌వో)లు నేరుగా కలిసి నోటీసులు అందించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి(సీఈవో) సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. నోటీసులు అందుకున్న ఓటరు నుంచి రసీదును తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులు(డీఈవో), ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో శనివారం సీఈవో సుదర్శన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ‘‘నోటీసులు అందుకునే ఓటర్లకు విచారణ తేదీ, సమయం, ప్రదేశం గురించి బీఎల్‌వోలు కనీసం రెండు రోజుల ముందుగానే గుర్తు చేయాలి. నోటీసులకు ఓటర్లు సమర్పించే గుర్తింపు కార్డుల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. విచారణకు వచ్చే ఓటర్ల సంఖ్యను బట్టి ఏఈఆర్వోలు, అదనపు ఏఈఆర్వోలను సిద్ధం చేయాలి. అనామలీస్, అన్‌మ్యాపింగ్ ఓటర్ల వివరాలను రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచాలి. అభ్యంతరాలు, ఫిర్యాదులపైన ప్రతి వారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలి. ఎన్నికల సంఘం ప్రకటించిన విధివిధానాలను కచ్చితంగా పాటించాలి. ప్రతి అంశాన్ని రికార్డు చేయాలి’’ అని సీఈవో సుదర్శన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అదనపు సీఈవో వాసం వెంకటేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ సీఈవోలు జీ.ఎస్.చారి, ప్రసూనాంబ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి ఒకటే.. నిర్మాణం మరొకటే!

* **ఇంటి నిర్మాణానికి అనుమతి....**
* **కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం...**



హత్నూర, ప్రజాస్ఫూర్తి: అనుమతి ఇంటి కోసమైతే నిర్మాణం మాత్రం వాణిజ్య కోసం చేపట్టారు. అధికారులకు తెలిసిన తెల్వనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇంటి నిర్మాణానికి అనుమతులు తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా కన్వెన్షన్ సెంటర్ నిర్మిస్తున్నారన్న ఆరోపణలు హత్నూర మండలంలోని కాసాల గ్రామ పంచాయతీ పరిధిలో నెలకొంది. దౌల్తాబాద్ ప్రధాన రహదారి పక్కన వెలసిన ఈ నిర్మాణంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం.. సర్వే నంబర్ 316/ఈఈ 2/2లో 358.79 చదరపు గజాల స్థలంలో జీ+2 ఇంటి నిర్మాణానికి గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు పొందినట్లు తెలుస్తోంది. అయితే ఆ అనుమతులను ఆధారంగా చేసుకుని సంబంధిత వ్యక్తులు అదే స్థలంలో కన్వెన్షన్ సెంటర్ (కళ్యాణ మండపం) తరహాలో భారీ నిర్మాణం చేపట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటి నిర్మాణానికి మంజూరైన అనుమతులు ఒకవైపు ఉంటే.. ప్రస్తుతం అక్కడ కనిపిస్తున్న నిర్మాణం మరోవైపు ఉందని స్థానికులు అనుమాన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అసలు అనుమతులు ఏ నిర్మాణానికా..? ప్రస్తుతం ఉన్న భవనం ఏ అవసరానికి..?* అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**నిబంధనలు పాటించారా?**

భవన నిర్మాణానికి సంబంధించి మంజూరైన అనుమతుల మేరకే నిర్మాణం జరిగిందా? లేక అనుమతులకు భిన్నంగా నిర్మాణాన్ని చేపట్టారా? అనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా భవన నిర్మాణం, ప్రస్తుత వినియోగం, వాణిజ్య కార్యకలాపాలకు సంబంధించిన అనుమతులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.గ్రామ పంచాయతీ పరిధిలో జీ+2 నిర్మాణానికి సంబంధించి నిబంధనలు, అనుమతులపై కూడా అధికారులు సమగ్రంగా పరిశీలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడం పట్ల పలు అనుమానాలు తేలేత్తుతున్నాయి.

* **దృష్టికి వచ్చింది.. విచారణ జరిపి చర్యలు**

కాసాల పంచాయతీ పరిధిలో దౌల్తాబాద్ రహదారి వెంట ఇంటి నిర్మాణానికి అనుమతులు పొంది కన్వెన్షన్ సెంటర్ నిర్మించిన విషయం తమ దృష్టికి వచ్చిందని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై విచారణ జరిపి, అనుమతులు ఇచ్చిన అధికారులు, నిర్మాణం చేపట్టిన వ్యక్తులకు నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారుల పాత్రపైనా విచారణ చేపట్టి నిబంధనల ఉల్లంఘన తేలితే చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : క్రీడా ప్రాధికార సంస్థ తెలంగాణ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వర్చువల్ కార్యక్రమాన్ని మహబూబాబాద్ జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు,శారీరక విద్యా ఉపాధ్యాయులు పీఈటీలు క్రీడాకారులు, క్రీడాభిమానులు ఉత్సాహంగా వీక్షించారు.కార్యక్రమంలో మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తిదాయక జీవితం, క్రీడల ప్రాముఖ్యత, ఫిట్ ఇండియా సందేశం, ప్రముఖుల ప్రసంగాలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని వీక్షించిన విద్యార్థులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తూ, ఇలాంటి ప్రేరణాత్మక కార్యక్రమాలను నిర్వహించిన స్టాగ్ కు కృతజ్ఞతలు తెలిపారు.మహబూబాబాద్ జిల్లాలో ఈ వర్చువల్ కార్యక్రమం విజయవంతంగా గవర్నమెంట్ బాయ్స్ జూనియర్ కళాశాల యందు నిర్వహించబడిందనిజిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి,కాలేజ్ ప్రిన్సిపాల్ సిబ్బంది,కోచ్ లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సెన్సస్ హ్యాండ్ బుక్ సమాచారం ఆన్ లైన్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి

* **జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



ప్రజాస్ఫూర్తి, భైంసా : సెన్సస్ హ్యాండ్ బుక్ మ్యానువల్ సమాచారం మొత్తాన్ని ఆన్ లైన్ చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం నిజామాబాదు నుంచి జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులతో సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలాలు, మున్సిపాలిటీల వారిగా ఇప్పటివరకు సేకరించిన నిర్దేశిత సమాచారం, ఇంకా సేకరించాల్సిన వివరాలు అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. సేకరించిన సమాచారాన్ని మొత్తం నిర్దేశిత ప్రొఫార్మాలో ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. సేకరించే, ఆన్ లైన్ చేసే సమాచారం మొత్తం తప్పులు లేకుండా ఉండాలన్నారు. వివిధ శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని తెలిపారు.ఈ వీసీలో జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, సిపిఓ గంగారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం జిల్లా స్థాయి ప్రజావాణి రద్దు

* **వినతులతో కలెక్టరేట్‌కు రావద్దని ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 31న రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మహబూబాబాద్‌లో ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించే జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో వెల్ల డించారు. ప్రజలు ఈ విషయాన్ని గమ నించి తమ వినతులు, ఫిర్యాదులతో సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని కలెక్ట ర్ కోరారు. అయితే డివిజన్, మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్ర మాలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు తమ సమస్యలు, వినతులను సంబంధిత డివిజన్, మం డల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా వాణి కార్యక్రమాల్లో సమర్పించుకోవచ్చ ని సూచించారు.

## బుల్లెట్ రైలు దీక్ష లకు మద్దతు పలికిన పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జాతీయ రహదారి 65కు సమాంతరంగా బుల్లెట్ ట్రైన్ మరియు రైల్వే కారిడార్ సాధన కోసం రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలలో భాగంగా 16వ రోజున ప్రగతిశీల మహిళా సంఘం జరుపుతున్న నిరాహార దీక్షలకు మద్దతుగా సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య నాయకులు పాల్గొని మద్దతు పలికారు... ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు కర్నాటి కిషన్, జిల్లా ఆర్యవైశ్య సంఘం కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్, పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ సలహాదారులు మిట్టపల్లి రమేష్ లు మాట్లాడుతూ రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు. సూర్యాపేటకు మొదట చేసిన అలైన్మెంట్ ప్రకారం బుల్లెట్ రైలు రావాల్సి ఉండగా ప్రాముఖ్యత లేని కొండమల్లేపల్లి హాలియా సాగర్ మీదుగా మార్చడం జరిగిందని అన్నారు. మొదట ప్రకటించిన విధంగా బుల్లెట్ ట్రైన్ ను హైదరాబాద్ సూర్యాపేట అమరావతి మీదుగా చెన్నైకి నడపాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు గుండా శ్రీధర్, సోమ వెంకటేశ్వర్లు, కోశాధికారి ఉప్పల శ్రవణ్ కుమార్, సోమ ప్రవీణ్, దోగుపర్తి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్య పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

* **వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో కార్యాచరణకు శ్రీకారం**
* **బిఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు నేతృత్వంలో ఎమ్మెల్యేల సమావేశం**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : బీఆర్ఎస్ పార్టీ చేపట్టనున్న కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్య పాలనపై సమరభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో పార్టీ శ్రేణులు కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు మేడ్చల్ జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యేలు,ముఖ్యనాయలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి మల్లారెడ్డి,ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు,కేపీ వివేకానంద గౌడ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి లతో పాటుగా ముఖ్యనాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు పరిస్థితి, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై సమావేశంలో నాయకులు విస్తృతంగా చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం, అభివృద్ధి పనుల్లో జాప్యం, సంక్షేమ పథకాల అమలులో నెలకొన్న ఇబ్బందులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల ముందుకు తీసుకెళ్లేలా సమరభేరి మోగించాలని ఈ సమావేశంలో నాయకులు నిర్ణయించారు. ప్రభుత్వ వైఫల్యాలను కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం చేయకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి.. వాటిపై ప్రభుత్వాన్ని నిలదీసేలా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముమ్మర కార్యక్రమాలను చేపట్టాలని ఈ సమావేశం నిర్ణయించింది.ముఖ్యంగా మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాలో 22ఏ సమస్య,అభివృద్ధి పనులు, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, చెరువులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ట్రాఫిక్ సమస్యలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, సంక్షేమ పథకాలు తదితర స్థానిక సమస్యలపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించాలని జిల్లా నాయకులు నిర్ణయించారు.1000 రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఏం దక్కింది? ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారు? గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల్లో ఎన్ని కొనసాగిస్తున్నారు? అనే అంశాలను ప్రజల ముందుంచి, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సమరభేరికి సిద్ధం కావాలని జిల్లా సమావేశంలో నాయకులు నిర్ణయించారు.బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్గదర్శంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,మాజీ మంత్రి హరీష్ రావు లనాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల తరపున ప్రశ్నిస్తుందని జిల్లా నాయకత్వం స్పష్టం చేసింది.

## మహిళా పారిశ్రామికవేత్తల ఉన్నతికి 'ర్యాంప్' వరం

* **వ్యాపార విస్తరణ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి**



ప్రజా స్ఫూర్తి, భైంసా: మహిళలు పారిశ్రామిక రంగంలో రాణించి ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో విజయలక్ష్మి సూచించారు. మహిళా పారిశ్రామికవేత్తలు తమ వ్యాపారాలను మరింత విస్తరించుకునేందుకు 'ర్యాంప్-ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం' చక్కటి అవకాశమని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వ ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ ఆధ్వర్యంలోని వి హబ్ సౌజన్యంతో జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు, మహిళా పారిశ్రామికవేత్తల కు శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'ర్యాంప్-ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం'పై అవగాహన సదస్సు నిర్వహించారు.ప్రపంచ బ్యాంకు, కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ సంయుక్త సహకారంతో 'ర్యాంప్' పథకాన్ని అమలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. పథకం కింద ఎంపికైన మహిళా పారిశ్రామికవేత్తలకు రెండేళ్లపాటు ప్రత్యేక శిక్షణ, మార్గదర్శకత్వం, అవసరమైన సహకారం అందిస్తారని నిర్వాహకులు తెలిపారు. జౌళి, ఆహార శుద్ధి, తయారీ, చేతివృత్తులు, హస్తకళలు తదితర రంగాల్లోని వ్యాపార సంస్థలకు ప్రోత్సాహం కల్పిస్తారన్నారు. వ్యాపార నిర్వహణ నైపుణ్యాల పెంపు, ఉత్పత్తుల నాణ్యత మెరుగుదల, కొత్త ఉత్పత్తుల రూపకల్పన, ఉత్పత్తుల వైవిధ్యీకరణ, బ్రాండింగ్, మార్కెటింగ్‌లో అవసరమైన సహకారం అందిస్తారని వివరించారు. సదస్సులో 'ర్యాంప్-ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం'కు సంబంధించిన అర్హతలు, ఎంపిక విధానం, శిక్షణ, ప్రయోజనాలు, వ్యాపార విస్తరణకు అందించే సహకారంపై మహిళలకు అధికారులు అవగాహన కల్పించారు. వ్యాపారాలను విస్తరించేందుకు ఆసక్తి చూపిన పలువురు మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో డీపీఎం మారుతి, విహబ్ డైరెక్టర్ జాహిద్ షేక్, అసోసియేట్ డైరెక్టర్ ఊహ, ప్రతినిధులు డాక్టర్ దెబోశ్రీ, రూపానంద్, హరిచందన, స్వయం సహాయక సంఘాల మహిళలు, మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## దేశం గర్వించేలా బంగారు పతకాలు సాధించే స్థాయికి ఎదగాలి

* **టీవిఆర్ మోడల్ హైస్కూల్లో మేనేజింగ్ డైరెక్టర్ వంశీ కృష్ణారెడ్డి**




జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : దేశం గర్వించేలా బంగారు పతకాలు సాధించే స్థాయికి ఎదగాలని టీవిఆర్ మోడల్ హైస్కూల్లో మేనేజింగ్ డైరెక్టర్ వంశీ కృష్ణారెడ్డి హితవు పలికారు. టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి.వంశీకృష్ణరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. సుభాష్నగర్ డివిజన్ పరిధిలోని ఎస్ఆర్ నాయక్ నగర్ పాఠశాలల స్కూల్ క్యాబినెట్ విద్యార్థిని విద్యార్థులు వీరా జవాలను వెలిగించి భారీ ర్యాలీ నిర్వహించారు అనంతరం మెయిన్ బ్రాంచ్ టీవిఆర్ మోడల్ హైస్కూల్లో మేనేజింగ్ డైరెక్టర్ వంశీ కృష్ణారెడ్డి స్పోర్ట్స్ ఫ్లాగ్ ఎగరవేసారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా మైదానంలో హాకీ మాంత్రికుడు "మేజర్ ధ్యాన్చంద్" పుట్టినరోజుని 29 ఆగస్ట్ 1995 న "నేషనల్ స్పోర్ట్స్ డే గా" ఆనాటి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ( భారత ప్రభుత్వం ) ప్రకటించిందన్నారు. నాటినుండి నేషనల్ స్పోర్ట్స్ డే ను భారతదేశమంతా జరుపు కుంటుందన్నారు. క్రీడ మైదానం నుండి భారతదేశానికి ఎన్నో బంగారు పతకాలను సాధించి భారత దేశ సత్తాను చాటి విజయకేతనం ఎగురవేసిన క్రీడాకారులను స్ఫూర్తిగా భారతదేశ యావత్ విద్యార్థి లోకం భారతదేశానికి గర్వంగా పిలవాలని " హర్ బచ్చా కేలేగ భారత్ ఆగే బడేగా" అనే నినాదంతో ముందుకెళ్ళాలన్నారు. ఉదయం 4 నుండి 5 గంటలకు లేచి క్రీడా మైదానానికి వెళ్లి శరీర దృఢత్వాన్ని పెంచే వ్యాయామాలను చేయాలని దాని ద్వారా శారీరకంగా మానసికంగా బలపడి గొప్ప పౌరుడు గాను క్రీడాకారునిగా ఎదుగుతారని సృజించారు ఈ విద్యా సంవత్సరం నుండి ప్రతి విద్యార్థి సూర్యోదయం కంటే ముందు లేచి ఒక గంట వ్యాయామాలు చేయాలని అందుకు టీవిఆర్ మోడల్ హై స్కూల్ లో వ్యాయామ ఉపాధ్యాయులచే ఫిజికల్ ఫిట్నెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం కనుక ప్రతి ఒక్క విద్యార్థి పాల్గొని మంచి ఆరోగ్య వంతులుగా ఎదుగుతారని ఆశిస్తున్నానని తెలిపారు. టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ ట. కోటి రెడ్డి , అకాడమిక్ డైరెక్టర్, సుర రవిచంద్రా రెడ్డి , దీప్తి రెడ్డి నేషనల్ స్పోర్ట్స్ డే శుభాకాంక్షలు తెలియజేస్తూ నిర్వహించిన అధ్యాపక బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమం ప్రిన్సిపల్ యం జయరాజ్ , వ్యాయామ ఉపాధ్యాయుల నిర్వహణలో స్కూల్ క్యాబినెట్ , క్రమశిక్షణ మండలి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## జాతీయ లోక్‌అదాలత్‌లో పెద్దఎత్తున కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా,ప్రజా స్ఫూర్తి: సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో పెద్దఎత్తున కేసుల పరిష్కారానికి పోలీసు, ఎక్సైజ్ అధికారులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ జె.జీవన్‌కుమార్ సూచించారు. జాతీయ లోక్‌అదాలత్ ఏర్పాట్లపై శనివారం పోలీసు, ఎక్సైజ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. రాజీ పడదగిన క్రిమినల్, మోటారు వాహన కేసులతో పాటు ఇతర కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించి, ఇరుపక్షాల అంగీకారంతో వీలైనన్ని కేసులను పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల, అదనపు ఎస్పీ ఏ.నరేష్‌కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏదులాపురం శ్రీనివాస్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.కిరణ్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో అట్టహాసంగా ఎన్ఎండీసీ మారథాన్



హైదరాబాద్: దేశంలోనే అతిపెద్ద ఎన్ఎండీసీ మారథాన్ రన్ హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. దేశంలోని అనేక ప్రాంతాలు సహా విదేశాల నుంచి కూడా రన్నర్స్ వచ్చి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఫుల్ మారథాన్, హాఫ్ మారథాన్, 10 కే విభాగాల్లో రన్ కొనసాగింది. వేలాది మంది రన్నర్స్‌తో నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజా నుంచి ప్రారంభమై హుస్సేన్ సాగర్ లేక్, లోక్‌భవన్ మీదుగా గచ్చిబౌలి స్టేడియం వరకు మారథాన్ రన్ నిర్వహించారు. హాఫ్ మారథాన్‌ను జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ప్రారంభించారు. మారథాన్ దృష్ట్యా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

# డల్లాస్‌లో ఉర్రూతలూపిన ఏషనాగుల కట్టమీద

తెలంగాణ జానపదం డల్లాస్ వేదికపై మారు మోగింది. నాని ప్యారడైజ్ సినిమాలోని ఏషనాగుల కట్టమీద పాటను డల్లాస్‌లో జరిగిన అనిరుధ్ మ్యూజిక్ కాన్సెర్ట్‌లో రిలీజ్ చేశారు. ఈ పాట ప్రస్తుతం యూ ట్యూబ్‌తో పాటు మిగిలిన మ్యూజికల్ ప్లాట్‌ఫామ్స్‌లో ట్రెండింగ్‌లో ఉంది. లిరికల్ వీడియోను కూడా శనివారం రిలీజ్ చేశారు. నాని, కీర్తి సురేష్ తమ స్టెప్పులతో అదరగొట్టారు. ఈ మూవీలో నానికి జోడీగా కయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీకి శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తుండగా సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు.



# బేబీ కోసం షాపింగ్ చేశా

మాతృత్వపు బంధంపై హీరోయిన్ సమంత ఆసక్తికర కామెంట్లు చేసింది. ఇన్‌స్టా వేదికగా ఓ పోస్టు పెట్టింది. తల్లిగా మారే క్షణాల కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నా. ప్రెగ్నెన్సీ కారణంగా తాను 11 కేజీల బరువు పెరిగాను. అదొక అందమైన, అనిర్వచనీయమైన అనుభూతి. పుట్టబోయే బిడ్డ కోసం అవసరమైన వస్తువులన్నీ కొనేశాను. వాటిని ప్యాక్ చేసి ఓ బాక్స్‌లో పెట్టాను. ఆ బాక్స్‌ను ప్రస్తుతం ల్యాప్‌ట్యాప్ స్టాండ్‌గా వాడుతున్నా అని చెప్పింది. దీంతో పాటు మీ బేబీకి పేరు సెలెక్ట్ చేశారా అని ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు రిప్లై ఇచ్చింది. "పేరును సెలెక్ట్ చేయడం చాలా కష్టం. అందరి హెల్ప్ తీసుకొని ఓ మంచి పేరును నిర్ణయించాలని అనుకుంటున్నా" అని సమంత అన్నది.




# డబ్బుల్లేనప్పుడు లూజర్

నాగార్జున బర్త్‌డే సందర్భంగా ఆయన హీరోగా నటిస్తోన్న వందో మూవీ గ్లింప్స్ రిలీజైంది. మనుషుల్లో రెండు రకాలు.. డబ్బు న్నోళ్లు.. డబ్బు లేనోళ్లు.. అంటూ నాగార్జున డైలాగ్‌తో ఈ గ్లింప్స్ ప్రారంభమైంది. డబ్బులేనప్పుడు నన్ను లూజర్ అన్నారు. డబ్బున్నప్పుడు దే కాల్ మీ ద కింగ్ అంటూ చెప్పిన డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. ఈ గ్లింప్స్‌లో నాగార్జున స్టైలిష్ లుక్‌లో కనిపించాడు. దేవీశ్రీప్రసాద్ బీజీఎమ్ ఈ గ్లింప్స్‌కు హైలైట్‌గా నిలిచింది. క్రిస్మస్ కానుకగా ఈ ఏడాది డిసెంబర్ 24న థియేటర్లలోకి రానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. పొలిటికల్ అంశాలతో ఈ మూవీ రూపొందుతోన్నట్లు ప్రచారం జరుగుతోంది. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నాగార్జున ఈ సినిమాను నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా టైటిల్‌ను రివీల్ చేయబోతున్నారు. రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో టబు, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.



# ఎల్లమ్మకు హీరోయిన్ దొరికింది

ఎల్లమ్మ మూవీకి హీరోయిన్ దొరికింది. సుదీర్ఘ కాలంగా సాగుతోన్న సస్పెన్స్‌కు తెరపడింది. కథానాయికగా అనంతిక సనీల్ కుమార్ కన్ఫామ్ అయినట్లు సమాచారం. మ్యాడ్, ఎనిమిది వసంతాలు సినిమాల ఫేమ్ అనంతిక సనీల్ కుమార్ ఈ సినిమాలో కథానాయికగా కనిపించబోతున్నట్లు సమాచారం. ఇటీవలే దేవిశ్రీప్రసాద్, అనంతిక సనీల్ కుమార్‌లపై మేకర్స్ టెస్ట్ షూట్ జరిపినట్లు సమాచారం.





# టాలీవుడ్‌లోకి రీఎంట్రీ

ఢిల్లీ బ్యూటీ తాప్సీ నాలుగేళ్ల తర్వాత టాలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇవ్వబోతున్నట్లు సమాచారం. కొరియన్ కనకరాజు డైరెక్టర్ మేర్లపాక గాంధీతో తాప్సీ ఓ హారర్ సినిమా చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. పాటలు, కామెడీ లేకుండా ప్రయోగాత్మకంగా ఈ సినిమా ఉండబోతున్నట్లు చెబుతున్నారు. హిందీలో అవకాశాలు చాలానే వచ్చినా విజయాలు మాత్రం దక్కలేదు. మరోవైపు యంగ్ హీరోయిన్ల జోరుతో తాప్సీ వైపు డైరెక్టర్లు కన్నెత్తి చూడటం లేదని టాక్. దాంతో ఈ బ్యూటీ తిరిగి టాలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇచ్చే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. చివరగా తెలుగులో 2022లో మిషన్ ఇంపాజిబుల్ సినిమా చేసింది. తాప్సీ నటించిన గాంధారి సెప్టెంబర్ 3న డైరెక్ట్‌గా ఓటీటీలో రిలీజ్ కాబోతుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.